క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన



నర్సాపురం(విస్సన్నపేట): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. మండలంలోని నర్సాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయాలకు మంజూరైన రూ.40 లక్షల నిధులతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సాపురం పంచాయతీలో రూ. 22 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లిమెర్సీ వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ రాణి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి మంజూరు

మైలవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా 11మంది లబ్ధిదారులకు తాజాగా రూ.17.58 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఒకరికి రూ.1.30 లక్షలు, విజయవాడ రూరల్ మండలంలోని ఒకరికి రూ.70 వేలు, జి.కొండూరు మండలంలో ఆరుగురికి రూ.4.10 లక్షలు, మైలవరం మండలంలో ఇద్దరికి రూ.10.58 లక్షలు, రెడ్డిగూడెం మండలంలో ఒకరికి రూ.90 వేలు మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారులకు చెక్కులను అందజేసినట్లు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

నేడు సచివాలయం ప్రారంభం

విస్సన్నపేట: స్థానిక గ్రామ సచివాలయం-1 భవనాన్ని ఎమ్మెల్యే కే రక్షణనిధి బుధవారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. సచివాలయం నూతన భవనంతో పాటు రెండు ఆర్‌బీకే సెంటర్లు ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నూతన పింఛన్లు అందజేత

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంజూరైన కొత్త పింఛన్లను జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీరాంపురం గ్రామంలో విధులు నిర్వహిస్తున్న కేవీ రమణకుమారిని సన్మానించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్ రెడ్డి, నాయకులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, రామినేని వీరస్వామినాయుడు, ఓబులాపురం సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, మాజీ ఎంపీపీ మైలమాల కాంతారావు, ఎంపీటీసీ సభ్యురాలు మాధవీలత, ఎంపీడీఓ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో నిర్వహించనున్న డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, 18–30 ఏళ్ల లోపు వయస్సున్న నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 83740 39719లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

తిరువూరు: స్థానిక నాగార్జున హైస్కూలులో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. విద్యార్థులకు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కృష్ణాష్టమి విశిష్టతను పాఠశాల కరస్పాండెంట్ వీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరసింహారావు వివరించారు. కృష్ణాష్టమి పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చనుబండ పీహెచ్‌సీ-2లో వైద్య సేవలు ప్రారంభం

చాట్రాయి: మండలంలోని చనుబండలో పీహెచ్‌సీ- 2లో వైద్య సేవలు ప్రారంభించినట్టు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆశ తెలిపారు. 2వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పీహెచ్‌సీలో డాక్టర్లు దుర్గాప్రసాదు, జ్యోతి రోగులకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ కె.నరేంద్ర పాల్గొన్నారు.

గేదెల కొనుగోలుకు రుణ సౌకర్యం

మేడూరు(గంపలగూడెం): జగనన్న పాల వెల్లువలో భాగంగా గేదెల కొనుగోలు చేసేందుకు రైతులకు బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. మండలంలోని మేడూరు, చింతలనర్వ సచివాలయాల పరిధిలోని మేడూరు, సత్యాలపాడు, చెన్నవరం, చింతలనర్వ గ్రామాలకు చెందిన వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు మేడూరు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు ద్వారా రుణం ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు అంగీకరించారన్నారు. సర్పంచ్‌లు గుండ్ల లక్ష్మీ, గోవర్ధనరెడ్డి, పశువైద్యులు సాయికృష్ణ, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఏసోబు పాల్గొన్నారు.

ఆచార్య దేవోభవ

భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు.



విస్సన్నపేట గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరు ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

ఘనంగా గురు పూజోత్సవం

తిరువూరు: తిరువూరులో గురు పూజోత్సవాన్ని పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో రాజుపేట ఎంపీయూపీ పాఠశాలలో ఎంఈఓ-2 రామకృష్ణను, ఉపాధ్యాయులను సత్కరించారు. సర్వోదయ యూపీ స్కూలు ఆవరణలో వాసవి, వనిత, యువజన క్లబ్‌లు సంయుక్తంగా రిటైర్డు ఉపాధ్యాయులు తోట ఉమామహేశ్వరరావు, రామనరసింహారావును సన్మానించారు. తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మురళీకృష్ణ నివాళులర్పించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కలెక్టర్ ఢిల్లీరావు నుంచి అవార్డు అందుకున్న మూలపాడు జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయిని ఎం.తేజోమయిని ఉపాధ్యాయులు సత్కరించారు. కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా తదితరులు రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు.

గురువు స్థానం విశిష్టమైనది

మైలవరం: భారతదేశ సంస్కృతిలో గురువు స్థానం విశిష్టమైనది, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు తరువాత స్థానం గురువుదే అని పేర్కొన్నారు. ఒక వ్యక్తి సమాజ, జాతి నడకకు, నడతకు, పురోగతికి, శ్రేయస్సుకు గురువు మార్గదర్శనం తప్పనిసరి అని తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మైలవరం ఎస్ఎస్‌కే హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుపూజోత్సవరం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

ఆగిరిపల్లిలో..

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లిలోని జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. హైస్కూల్ ఉపాధ్యాయులను సత్కరించారు. హైస్కూల్ హెచ్‌ఎం పుష్పలతను ఆగిరిపల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సునీల్ సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో చాలా ఉన్నతమైనదని, దాని గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అన్నారు. పట్టణంలోని డీవైఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం 10 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, డీవైఈఓ ఎం సేవియా, ఎంఈవో-2 జమలయ్య, పాల్గొన్నారు.

గొల్లపల్లి హైస్కూల్లో మంగళవారం పాఠశాల హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ టీచర్ మనోహరంను సత్కరించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: వ్యక్తి భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం ఒక్క ఉపాధ్యాయ వృత్తికి మాత్రమే ఉందని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పేర్కొన్నారు. చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, కృపావతి, రమేష్, షేక్‌షరీఉన్నీసా, దారా దిలీప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు కారంగుల వాసు, ఎంఈఓలు బ్రహ్మాచారి, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో..

తిరువూరు: తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు యరమల ప్రతాప్‌రెడ్డి, పంబి వెంకటేశ్వరరావు, తోట ఉమామహేశ్వరరావు, నాళ్లా కాశీ, గుంజా కృష్ణమోహన్‌లను క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నాగుబండి శ్యాంసుందర్, పసుమర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు కొమ్మినేని రాజేష్‌ఖన్నా, నాగుబండి రాజేశ్వరరావు తదితరులు సత్కరించి వారి సేవలను ప్రశంసించారు.

లక్ష్మీపురంలో..

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. లక్ష్మీపురం, చిట్టేల, మల్లేల, కోకిలంపాడు, రోలుపడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చెవుటూరు గ్రామానికి చెందిన మాదల సత్యానారాయణ సహకారంతో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తున్న 14మంది ఉపాధ్యాయులతో పాటు ఇద్దరు ఎంఈఓలు పి వెంకటనర్సింహారావు, వీరాస్వామిని హెచ్‌ఎం కెఎన్‌జె లక్ష్మి సన్మానించారు.

ఆగిరిపల్లి విద్యాశాఖ ఆధ్వర్యంలో..

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ పీ శంకర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడే విద్యార్థులకు విలువైన పాఠ్య గ్రంథమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జీవరత్నం, ప్రభావతి, సీతాదేవి, గౌతమి, శామ్యూల్, ఎలీషాను సన్మానించారు. అనంతరం ఎమ్మార్సీకి రూ.12వేలు విలువైన కుర్చీ, టేబుల్ అందించిన వట్టిగుడిపాడు ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయురాలు ఇందిర, నాగభూషణం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సర్వేశ్వరరావు, ఎంఈఓ-2 ఆనంద్, ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, వేణుగోపాలరావు, యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, అజరయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పావనజ్యోతి సుజనా కుమారి పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులే

మైలవరం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేది గురువులేనని మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మైలవరం లయన్స్ క్లబ్ సభ్యులు మైలవరంలో ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. స్థానిక గిరిజన పాఠశాల శ్రీలీలావతి పబ్లిక్ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ రాధాకుమారితో పాటు, వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి, ఎం శ్రీనివాసరావు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ వీవీ లక్ష్మీ, ఎస్ఎస్‌కే పాఠశాల కరస్పాండెంట్ గొల్లపూడి మోహనరావు తదితర ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రతి ఒక్కరినీ తీరిదిద్దేది గురువు మాత్రమే

ఎమ్మెల్యే రక్షణనిధి

నర్సాపురం(విస్సన్నపేట): ప్రతి ఒక్కరినీ ఉన్నతులుగా తీర్చిదిద్దేది గురువు మాత్రమేనని అందుకే తల్లిదండ్రులు తర్వాత గురువునకు అంత గొప్పస్థానం కల్పించినట్లు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని నర్సాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లిమెర్సి వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ శివబాజీ, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లు గణపతిరెడ్డి, ఎంపీటీసీ మారేసు, ఎంఈఓ-2 సుధాకర్ పాల్గొన్నారు.



చెవుటూరు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులను సన్మానించిన హెచ్‌ఎం లక్ష్మి



మైలవరంలో ఉపాధ్యాయులకు సన్మానం



చాట్రాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దేశిరెడ్డి



తిరువూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డు ఉపాధ్యాయులకు సన్మానం



తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి



కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మూలపాడులో ఉత్తమ ఉపాధ్యాయురాలు తేజోమయిని సత్కరిస్తున్న హెచ్‌ఎం డేవిడ్‌రాక్



ఆగిరిపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పుష్పలతను సత్కరించిన ఉపాధ్యాయులు, ఎస్‌బీఐ మేనేజర్



నూజివీడులో ఉపాధ్యాయులను సత్కరించిన జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, ఎంపీపీ శిరీష



తిరువూరు మండలం లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్లో రాధాకృష్ణన్‌కు నివాళి

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి

నూజివీడు: పట్టణంలోని న్యాయస్థానాల ఆవరణలో ఈనెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ పేర్కొన్నారు. పట్టణంలోని 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో మంగళవారం బీమా కంపెనీల అధికారులతో, స్టాండింగ్ కౌన్సిల్స్‌తో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో కక్షిదారులు తప్పులు చేసి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో వారు చేసిన చిన్న తప్పులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వాహన ప్రమాద కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు బీమా కంపెనీలు ముందుకురావాలని సూచించారు. ఉన్నత న్యాయస్థానం తీర్పులను అనుసరించి బాధితులకు నష్టపరిహారం అందించాలన్నారు. సమావేశంలో ఏపీపీ ఎస్ఏ ఖాన్, న్యాయవాదులు రామకృష్ణ, రాజ్‌కుమార్, నరసింహారావు, బసవారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) సభ్యులు గ్రంథాలయ పుస్తకాలు, కంప్యూటర్ మంగళవారం వితరణ ఇచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తోసా ఆధ్వర్యంలో పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరించిన తోసా బృందం ఇటీవల ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన షేక్ ముబీనా, పిట్టా స్ఫూర్తిలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. తోసా గౌరవాధ్యక్షుడు కలకొండ రవికుమార్ పాల్గొన్నారు.



తిరువూరు జెడ్పీ హైస్కూల్‌కు 'తోసా' సభ్యుల వితరణ

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని అన్నారు. ఆమె మంగళవారం జిల్లాలోని కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రాయనపాడులో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ గర్భిణులకు రెగ్యులర్‌గా పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

దైవ మార్గంలో నడుచుకోవాలి

చాట్రాయి: ఏసు క్రీస్తు చూపిన దైవ మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. మండలంలోని బూరుగుగూడెంలో మంగళవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ వారు నిర్వహించిన సహవాస కూడికలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో దేశిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు పిళ్లా చరణ్, పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

లక్ష్మీపురం సొసైటీని సందర్శించిన డీసీఓ

లక్ష్మీపురం(తిరువూరురూరల్): ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తిరువూరు మండలానికి విచ్చేసిన త్రినాథ్ లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని మంగళవారం సందర్శించారు. సహకార సంఘాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి అనుగుణంగా సిబ్బంది తమ సహకారం అందించాలని ఆయన సూచించారు. తిరువూరు కేడీసీసీ బ్యాంకు మేనేజరు ఆజాద్, లక్ష్మీపురం సొసైటీ సీఈఓ బీ రఘు, సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి జ్యోతిర్మయి తదితరులు జిల్లా డీసీఓను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

జేజేఎం పనులకు శ్రీకారం

పెనుగొలను(గంపలగూడెం: అందరికీ తాగునీటి సరఫరాలో భాగంగా మండలంలోని పెనుగొలనులో నిర్వహించనున్న జలజీవన్ మిషన్ పనులను సర్పంచ్ సంగెపు లలిత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు జేజేఎం నుంచి రూ.46.37 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కాగా ఆ నిధులతో గ్రామంలో అవసరమైన చోట 1,800 మీటర్ల పొడవున పైపులైన్ ఏర్పాటు, రెండు బోర్లు తవ్వకం తదితర పనులు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్వామినాయక్ పేర్కొన్నారు. నూరుశాతం తాగునీటి సరఫరాలో భాగంగా ట్యాప్ కనెక్షన్లు లేని ఇళ్లకు ఉచితంగా కేటాయిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ సెర్వర్స్ అండ్ ప్రెసిడెంట్, ఏఐఎంఈఆర్ సొసైటీ సీఈఓ సాయి సతీష్ తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో రెండు రోజుల వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అనాలిసిస్ ఆఫ్ మెడికల్ యిమేజస్ యూజింగ్ ఏఐ అండ్ వర్కింగ్ ఆన్ ఓపెన్ ఎల్ఎల్ఎమ్ మోడల్స్-ఎస్ఎల్‌పీ అనే అంశంపై తృతీయ సంవత్సరం విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు, డీన్ అకాడమిక్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, విభాగాధిపతి డాక్టర్ వీరయ్య పాల్గొన్నారు.

సృజనాత్మకతతో ఉజ్వల భవిష్యత్

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు సృజనాత్మకతతో మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చని స్టూడెంట్ ట్రైబ్ సంస్థ సీఈఓ చరణ్ లక్కరాజు పేర్కొన్నారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బీటెక్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ గురించి స్పష్టమైన ఆలోచన ఉన్నవారే తమ ప్రయత్నంలో సఫలీకృతమవుతారని తెలిపారు. కళాశాల కరస్పాండెంటు పీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆర్.నాగేంద్రబాబు, ఏఓ కిషోర్ పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

తిరువూరు: స్థానిక శ్రీవేంకటాచలస్వామి దేవస్థాన హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఐదు నెలల 29రోజులకు రూ.2,85,089 ఆదాయం లభించినట్లు ఆలయ మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. హుండీ లెక్కింపులో బొర్రగూడెం ఆలయ కార్యనిర్వహణాధికారి సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావు, సభ్యులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ ఆదాయం రూ.1.31 లక్షలు

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి దేవస్థానంలో వివిధ అంశాలకు సంబంధించి మంగళవారం నిర్వహించిన వేలం పాట ద్వారా ఏడాదికి రూ. 1,31,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ మేనేజర్ జే వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయంలో కొబ్బరి చిప్పలు, పాటు, బియ్యం పోగు చేసుకునేందుకు, పొంగలి తయారీకి గ్యాస్ సరఫరాకు నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన వి. వైష్ణవి అత్యధికంగా రూ.1.31లక్షలకు పాడి కైవసం చేసుకున్నట్లు మేనేజర్ పేర్కొన్నారు. మూడు సంవత్సరాల వ్యవధికి నిర్వహించిన పాటను కైవసం చేసుకున్న పాటదారు నిర్ణీత మొత్తంపై తదుపరి రెండు సంవత్సరాలు 10 శాతం చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉందన్నారు. జి. కొండూరు గ్రూపు దేవస్థానాల మేనేజర్ ఎం.మోహనరావు పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం గాజులపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల పోషణ, విద్యపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ బాలల సమగ్ర అభివృద్ధి అంగన్‌వాడీల్లోనే జరుగుతుందని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌తో ఆరోగ్యం పొందుతారన్నారు. పోషణ మాసోత్సవంపై గర్భిణులు, బాలింతలతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ ఎమ్మెస్కే పద్మావతి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నూజివీడు: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు అన్నారు. మండలంలోని తూర్పు దిగవల్లి, గొల్లపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఆశా వర్కర్లకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్కుషాప్ నిర్వహించారు. వైద్యులు శ్రీనివాస్ గౌతం, శ్రీనివాసరావు, బాలభవన్ కో-ఆర్డినేటర్ రవి పాల్గొన్నారు.

పాఠశాలలు ఆహ్లాదకరంగా ఉంచాలి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని ఎంపీపీ పాఠశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. నాడు-నేడు పథకంలో అక్కడ జరుగుతున్న తరగతి గదుల రిపేర్లు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం తదితర పనులు పరిశీలించారు.